డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి



హజార్‌గల్లీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ హజార్‌గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మంచినీటి సమస్యలు సైతం వెంటనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన నీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచిముదిరాజ్, అనిల్‌కుమార్, వెంకటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో న్యూ ఎరా కళాశాల ప్రభంజనం



కళాశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంటర్మీడియట్ ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధించారని న్యూఎరా కళాశాల డైరెక్టర్ శ్రీభాష్యం శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. తమ కళాశాలలో అత్యుత్తమమైన అధ్యాపకులు తమ విద్యార్థులకు బోధిస్తారని తెలిపారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే పద్ధతిలో బోధించడంతో వారు పరీక్షల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

కాచిగూడ: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కాచిగూడ నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని డివిజన్‌లో కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించి వాల్ పోస్టర్లు అంటించారు. పార్టీ తలపెట్టిన ఆవిర్భావ సభకు మరో మూడు రోజులు మాత్రమే ఉండటంతో బస్తీల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ రమేష్, రాజేష్, మహేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్' విద్యార్థులకు అభినందనలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇంటర్మీడియట్ ఫలితాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. బుధవారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, సిఈఓ, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రిన్సిపల్ డాక్టర్ భారతి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం ... గుర్తుతెలియని వ్యక్తి (50) యాకుత్‌పుర - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో బంగారు నల్లపూసల గొలుసు చోరీ

కాచిగూడ: రైల్లో బంగారు నల్లపూసల గొలుసు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నానికి చెందిన బొత్స అప్పలరాజు (65) అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వస్తున్నాడు. మంగళవారం రాత్రి రైలు మోత్కేడ్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తి ప్రయాణికుడి ట్రాలీ బ్యాగును దొంగిలించాడు. బ్యాగులో బంగారు నల్లపూసల గొలుసుతో పాటు రెండు సెల్ ఫోన్లు ఉన్నాయి. దొంగ బ్యాగులో ఉన్న నల్లపూసల బంగారు గొలుసును తీసుకుని బ్యాగును మరో బోగిలో పడేసి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

శంకరమఠం మార్కెట్ మూలమలుపు వద్ద..



నల్లకుంట రైల్వేట్రాక్ వద్ద నేలను తాకుతున్న ఫ్యూజ్‌బాక్సు వైర్లు



టీఆర్టీకాలనీ శ్రీవిజయ గణపతి ఆలయం సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



డేంజర్ యమడేంజర్.!

ఎటు చూసినా కంచలేని ట్రాన్స్‌ఫార్మర్లు

- నేలను తాకుతున్న ఫ్యూజ్‌బాక్సుల కేబుళ్లు
- ప్రమాదమని తెలిసినా అక్కడే సామాన్లు
- కేబుళ్లకు తగిలితే ఇక అంతే సంగతులు!

నల్లకుంట డివిజన్ పరిధిలో ఎక్కడ చూసినా ఫెన్సింగ్ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కనిపిస్తున్నాయి. వాటి వద్ద ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సుల వైర్లు కిందకు వేలాడుతున్నాయి. ఫ్యూజ్ బాక్సులకు అమర్చే వైర్లు సరైన సైజులలో వేయకపోవడంతో అవి రోడ్డుపైకి వేలాడుతున్నాయి. ఇక ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల విషయానికి వస్తే అక్కడ ప్రమాదమని తెలిసినా చిన్నచిన్న కొట్లు పెట్టుకుని వాడేసుకుంటున్నారు. కొందరు సామాన్లు తదితర వస్తువులను అక్కడ పెట్టుకుంటున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాలు ఎప్పుడూ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా కనిపిస్తున్నాయి. తిలక్‌నగర్, నల్లకుంట రైల్వే ట్రాక్‌ల సమీపంలో, టీఆర్టీకాలనీ, విజ్ఞానపురికాలనీ, ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా తదితర ప్రాంతాలలో ఇలాంటివి ఎక్కువ కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి వాటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – నల్లకుంట



విజ్ఞానపురికాలనిలోని యూఎస్ పిజ్జా సమీపంలో వ్యర్థాలు



తిలక్‌నగర్ రైల్వేట్రాక్ వద్ద నేలకు తాకుతున్న ఫ్యూజ్‌బాక్స్ కేబుళ్లు



టీఆర్టీకాలనీ షటిల్ కోర్టు వద్ద..



శంకరమఠం ఎస్‌బీఐ బస్టాప్ వద్ద ఇలా..



వైభవ్‌నగర్ పార్కు మూలమలుపు వద్ద ప్రమాదకరంగా..

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

కాచిగూడ: తెలంగాణలో ఐదేళ్లుగా బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నింబోలిఅడ్డలోని బీసీ మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.5,200 కోట్ల విద్యార్థుల ఫీజుల బకాయిలను చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఆందోళనలు, ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు చేపట్టినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజుల బకాయిలను చెల్లించి విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ నేతలు ధరణీధర్ యాదవ్, ప్రశాంత్, భూషణ్ భాస్కర్, కృష్ణ, రణదీప్‌గౌడ్, సత్యపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నింబోలిఅడ్డలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్ పటేల్‌గౌడ్

సివిల్స్‌లో సత్తాచాటిన కానిస్టేబుల్

ఆల్ ఇండియా 350వ ర్యాంకు సాధించిన ఉదయ్ కృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సివిల్స్ టాపర్స్ ఉదయ్ కృష్ణారెడ్డి, సౌమ్య


సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పోలీస్ కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌లో విజయం సాధించే వరకు ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని ఆల్ ఇండియా సివిల్ సర్వీసు 350వ ర్యాంకు సాధించిన ఉదయ్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని హైదరాబాద్ జీఎస్ ఫౌండేషన్ క్లాస్ రూం టాపర్స్‌తో విజన్ ఐఏఎస్ అకాడమీలో విజేతలతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉదయ్ కృష్ణారెడ్డితోపాటు 951 ర్యాంక్ సాధించిన సిహెచ్ సౌమ్య కూడా పాల్గొన్నారు. ఉదయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయి అమ్మమ్మ రమణమ్మ వద్ద పెరిగానని ఆమె కూరగాయాలు అమ్మి నన్ను చదివించిందని తెలిపారు. నేను పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికై ఆరేళ్లు పనిచేశానని పేర్కొన్నారు. అక్కడ అవమానాలు పొంది కసితో ఐపీఎస్ సాధించాలనే లక్ష్యంతో చదివి ఈ ర్యాంక్ సాధించానని తెలిపారు. కానిస్టేబుళ్లు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ప్రమోషన్స్, జీతాలు, పనిభారం తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎంపీ, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. బుధవారం చలో ఉస్మానియా పిలుపు మేరకు రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఓయూ పాలన భవనం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాలనా భవనం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మెకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పీవోడబ్ల్యూ సంధ్య, ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ ప్రొ.పాపిరెడ్డి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు.

ఇక్కడ 24/7 వెలుగుతాయి!

స్ట్రీట్ లైట్స్ విభాగంలో పనిచేసే సిబ్బంది అలసత్వం కారణంగా కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళ వీధి దీపాలు వెలగవు. మరికొన్ని చోట్ల రాత్రి, పగలు అనే తేడా లేకుండా 24 గంటలూ వెలుగుతూనే ఉంటాయి. స్ట్రీట్ లైట్ల విభాగం అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీలలో ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. నియోజకవర్గంలోని పాత నల్లకుంట, తిలక్‌నగర్, బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలోని డీడీకాలనీ తదితర ప్రాంతాలలో స్ట్రీట్ లైట్ల విభాగం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వీధి దీపాలు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా నల్లకుంట తిలక్‌నగర్ బస్తీలో (ఇంటి నం. 2-2-1107/2 నుంచి 1107/35 వరకు), డీడీ కాలనీ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేన్‌లో వీధి దీపాలు కొన్ని రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. విషయాన్ని సంబంధిత స్ట్రీట్ లైట్స్ విభాగం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని బస్తీవాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్ట్రీట్ లైట్స్ విభాగం అధికారులు స్పందించి వీధి దీపాలు పగలు వెలగకుండా చూసేలా సిబ్బందిని ఆదేశించాలని కోరుతున్నారు. – నల్లకుంట



తిలక్‌నగర్ బస్తీలో పగలు కూడా వెలుగుతున్న వీధి దీపాలు

29న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి

కాచిగూడ: తెలంగాణ వ్యాప్తంగా 16లక్షల 75వేల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఈ నెల 29వ తేదీన మంగళవారం జరిగే జిల్లా కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. బుధవారం కాచిగూడలో గుజ్జ సత్యం మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఒక్క స్కాలర్‌షిప్‌లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్ బిల్లులు చెల్లించడం లేదని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు రోడ్లమీదకు వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకోకుండా చేసేకుట్రలో భాగమే ఫీజుల బకాయిలు ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు దశలలో బడ్జెట్ విడుదల చేయాలని కోరారు.

పీహెచ్‌డీ గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులకు మరో ఏడాది గడువు పొడిగించాలని బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఓయూలో 2018 అంతకంటే ముందు పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కరోన సమయంలో లాక్‌డౌన్ కారణంగా పరిశోధనలు చేయలేక పోయారని పేర్కొన్నారు. ఈ కారణంగా 2018, 2017 పీహెచ్‌డీ విద్యార్థులకు మరోక ఏడాది గడువును పొడిగించాలని కోరినట్లు తెలిపారు.

సమాజ శ్రేయస్సు కోసమే న్యాయ స్థానాలు



మూట్ కోర్ట్ కాంపిటీషన్‌ను ప్రారంభిస్తున్న ఓయు లా కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రాంప్రసాద్

కాచిగూడ: సమాజంలో జరిగే అన్యాయానికి అడ్డుగా చట్టాలు నిలబడుతాయని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. రాంప్రసాద్ అన్నారు. ఏబీవీపీ లా ఫోరం ఆధ్వర్యంలో నారాయణగూడలోని కేశవ మెమోరియల్ లా కళాశాలలో 'మూట్ కోర్ట్'కాంపిటీషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎటువంటి హింసకు చోటు లేకుండా సమ సమాజ శ్రేయస్సు కోసం న్యాయ స్థానాలు స్థాపించబడ్డాయని అన్నారు. అందులో న్యాయవాదుల పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు. యువ న్యాయవాదులు రాబోయే రోజుల్లో భారత పౌరుల కోసం వారి ప్రతిభని ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఏబీవీపీ దక్షిణ భారతదేశ సంఘటన మంత్రి శివకుమార్ జీ, లాఫోరం నేత కోలుగంగా చరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికొచ్చి సంపులో పడి మృతి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వచ్చిన ఓ వ్యక్తి బుధవారం నీటి సంపులో పడి మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. కాచిగూడకు చెందిన ఫ్రూట్ షాపు నిర్వాహకుడు బి.బాలాజీ (48) కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. కొబ్బరి కాయలు కొట్టే చోట నీటి సంపులో ఫోన్ పడిపోయింది. దీంతో ఈ విషయం సిబ్బంది తెలిపాడు. వారు పట్టించుకోకపోవడంతో తానే ఫోన్ తీసేందుకు యత్నించి సంపులో పడిపోయాడు. గమనించిన అక్కడి సిబ్బంది నిచ్చన సాయంతో బాలాజీని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అశోకుడి శాసనాల ప్రదర్శన



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అశోక చక్రవర్తి పాలన కాలం నాటి శాసనాలు, పురాతన స్మారకాలను ప్రదర్శించారు. బుధవారం ఫిలాసఫీ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఫిలాసఫీ హెడ్ ప్రొ.వంశీధర్ వీసీకి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ. కాశీం, డా.సుధాకర్, డా.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రవాదులను వదిలిపెట్టొద్దు



సుందరయ్య పార్కులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, వాకర్స్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద కాల్పులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు కోటా రమేష్, ఆనగంటి వెంకటేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. బుధవారం సాయంత్రం సుందరయ్య పార్కులో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్కు ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు, జావిద్, హస్మి బాబు, కిరణ్, మనోహర్, కొమ్ము విజయ్, కె.విజయ్‌కుమార్, వినయ్ అస్మిత తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయం

కవాడిగూడ: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపటం అత్యంత హేయమైన చర్య అని దీనిని దేశ ప్రజలంతా రాజకీయలకు అతీతంగా ముక్తకంఠంతో ఖండించాలని దోమలగూడ అడ్వకేట్ కాలనీ బాలత్రిపుర సుందరి దేవి ఆలయ చైర్మన్ టి.రవీందర్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించడంతో పాటు జమ్మూకశ్మీర్‌లో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన భక్తులతో కలిసి మాట్లాడారు. కశ్మీర్‌లో ఉగ్రవాదులదాడికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించి శాంతి భద్రతలు కాపాడాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులు కావాలని హిందూవులను టార్గెట్ చేసి కాల్పులు జరిపారని అన్నారు. ఆర్టికల్ 370 ఎత్తివేసిన తర్వాత పర్యాటక రంగంలో కశ్మీర్ అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని పాకిస్తానీ ఉగ్రవాది ముకాలు మరోసారి దాడికి పాల్పడ్డారన్నారు. వారిని ఎట్టి పరిస్థితిలో విడిచి పెట్టొద్దని కేంద్రాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఉగ్రవాదంపై ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ రవీందర్

కశ్మీర్‌లో పర్యాటకులపై దాడి దారుణం

ముషీరాబాద్: కశ్మీర్‌లో పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని టీజేఎస్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తీవ్రంగా ఖండించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కశ్మీర్‌లో దాడి చేసే ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టూరిస్టులకు రక్షణ కల్పించి స్వస్థలాలకు వెంటనే చేర్చాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సుమారు 500ల మంది కశ్మీర్‌లో ఉన్నారని వారిని వెంటనే హైదరాబాద్‌కు తీసుకొచ్చే విధంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా కశ్మీర్‌లో చనిపోయిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ గ్రేటర్ ప్రధానకార్యదర్శి రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్, నాయకులు ఇస్మాయిల్, సురేష్‌కుమార్, హనుమంతుగౌడ్, భాషా, రసూల్, మాణిక్యం, భాస్కర్, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీజేఎస్ గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య